చెట్లకు కల్లు గీత ప్రారంభం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: సిద్దిపేట పట్టణ పరిధి లింగారెడ్డిపల్లి గ్రామ గౌడ సంఘం వారు గురువారం ఈత వనానికి పూజలు నిర్వహించి కల్లు గీసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో ఈత, తాటి వనాల పెంపకం చేపట్టినట్లు తెలియజేశారు. యువత మద్యానికి బానిస కావద్దని, గీత వృత్తిని ప్రోత్సహించాలనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలియజేశారు. ఈత, తాటి కల్లు మేలు అని చెప్పారు. ఈత వనంలో మొత్తం 200 చెట్లకు కొత్తగా కల్లు గీయనున్నారు.

సమీకృత పాఠశాల స్థల పరిశీలన


తంగళ్లపల్లిలో పాఠశాల నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: కోహెడ మండలం తంగళ్లపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టే స్థలాన్ని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. 25 ఎకరాల్లో నిర్మించబోయే స్థలాన్ని రెవెన్యూ అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

‘రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్’ శంకుస్థాపన వాయిదా

హుస్నాబాద్, న్యూస్‌టుడే: కోహెడ మండలం తంగళ్లపల్లిలో నేడు జరగాల్సిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ శంకుస్థాపన కార్యక్రమం వాయిదా పడినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. తనకు ముందస్తుగా అంగీకరించిన ఇతర కార్యక్రమాల వల్ల మరోరోజున శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పెద్ద చరిత్ర ఉన్న బతుకమ్మ పండుగకు కాస్త వాన ఆటంకం కలిగించినా శ్రద్ధతో మహిళలు నిర్వహించుకోవడం విశేషమన్నారు. వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ రా అమ్మా

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు


సిద్దిపేట కోమటి చెరువు వద్ద యువతి


అక్కన్నపేటలో పాల్గొన్న మంత్రి ప్రభాకర్


మహిళలతో సెల్ఫీ దిగుతున్న హరీశ్‌రావు


శివాజీనగర్‌లో హరీశ్‌రావు సతీమణి శ్రీనిత, కుమార్తె వైష్ణవి


వర్షంలోనే ఆటాపాటలో పురాధ్యక్షురాలు రజిత, ఉపాధ్యక్షురాలు అనిత, మహిళలు

సిద్దిపేట టౌన్, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన సంబురాలు సద్దుల బతుకమ్మతో గురువారం ముగిశాయి. జిల్లాలో కొన్నిచోట్ల వాన కురిసినా మహిళలు ఆటాపాట ఆపలేదు. ఎక్కడికక్కడ స్థానిక చెరువులు, కుంటల్లో ‘మళ్లీ రావే బతుకమ్మా’ అని పాటలు పాడుతూ నీటిలో సాగనంపారు. హుస్నాబాద్, అక్కన్నపేటలో మంత్రి పొన్నం ప్రభాకర్.. సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, సతీమణి శ్రీనిత, కుమార్తె వైష్ణవి, బల్దియా అధ్యక్షురాలు మంజుల, చిన్నకోడూరు మండలంలో జడ్పీ మాజీ అధ్యక్షురాలు రోజాశర్మ, దుబ్బాకలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో వాన పడటంతో మహిళలు కొంత ఇబ్బందికి గురయ్యారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై సంబురాలు నిర్వహించారు.


జిల్లా కేంద్రంలోని కోమటిచెరువులో నిమజ్జనం సందడి


సిద్దిపేటలో ఆడుతున్న అతివలు


సిద్దిపేట: యువతి సందడి


తోటపల్లిలో సంబురాల్లో అతివలు


సిద్దిపేట: స్వీయచిత్రం దిగుతున్న యువతులు


హుస్నాబాద్: సామూహికంగా చెరువు వైపు వస్తున్న మహిళలు


హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై వేడుకలు

సుఖ, సంతోషాలతో జీవించాలి: హరీశ్‌రావు

చిన్నకోడూరు, సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం చిన్నకోడూరులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దుర్గమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ, సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు చీరలు, రూ.500 ఎక్కడ పాయే

బతుకమ్మ పండుగకు రెండు చీరలతో పాటు రూ.500 ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా ఇచ్చిన పాపాన పోలేదని హరీశ్‌రావు విమర్శించారు. గ్రామపంచాయతీలకు నిధులు సైతం విడుదల చేయకపోవటంతో పంచాయతీ కార్యదర్శులు అప్పుల పాలయ్యారన్నారు. సద్దుల బతుకమ్మ సంబరాల్లో భాగంగా కోమటిచెరువు కట్టపై భారాస నాయకులతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పువ్వులను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాల సాయిరాం, బల్దియా మాజీ ఛైర్మన్ రాజనర్సు, భారాస నాయకులు ఉన్నారు.

దుర్గాదేవిగా వర్గల్ విద్యాసరస్వతి



వర్గల్, న్యూస్‌టుడే: ప్రసిద్ధ వర్గల్ విద్యాధరి క్షేత్రంలో గురువారం సరస్వతి అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవిని ఆరాధిస్తే కష్టాలు తొలగుతాయని ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ పేర్కొన్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

బాలల బలం.. పోషకాహారమే మార్గం

న్యూస్‌టుడే, సిద్దిపేట: చిన్నారుల్లో పోషణ లోపం కొన్ని సందర్భాల్లో అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తరచూ అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అవసరమైన వైద్య సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత నెల పోషణ మాసోత్సవం వేళ ‘న్యూట్రీషియన్ ఛాంపియన్ ప్రోగ్రాం’కి శ్రీకారం చుట్టారు. వివిధ స్థాయిల్లో పోషకాహార లోపంతో బాధపడే ఐదేళ్లలోపు బాలబాలికలకు కావాల్సిన బలవర్ధక ఆహారం అందిస్తున్నారు.


సిద్దిపేట: అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన

జిల్లాలో అంగన్‌వాడీ ప్రాజెక్టులు	5
మొత్తం కేంద్రాలు	1150
ఉపాధ్యాయులు	1094
సహాయకులు	1009
ఐదేళ్లలోపు చిన్నారులు	61,643

నమోదు.. ఆపై నవీకరణ

అంగన్‌వాడీల్లో ఐదేళ్లలోపు బాలబాలికల ఎత్తు, బరువును ప్రతి నెలా మొదటి వారంలో నమోదు చేస్తున్నారు. తర్వాత నవీకరణ చేస్తున్నారు. ప్రధానంగా సామ్ (అతి తీవ్ర పోషణ లోపం), తీవ్ర పోషణ లోపం (మామ్), బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. వైద్యారోగ్య శాఖ సమన్వయంతో అవసరమైన పిల్లలను అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సంయుక్తంగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తున్నారు. బుధ, శనివారాల్లో ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు. వైద్యుల సూచనల మేరకు సిద్దిపేట సర్వజన ఆసుపత్రిలోని ఎన్ఆర్‌సీ (పౌష్టికాహార పునరావాస కేంద్రం)కి రెఫర్ చేస్తున్నారు. ‘న్యూట్రీషియన్ ఛాంపియన్ ప్రోగ్రాం’ నిరంతరాయంగా కొనసాగనుందని అధికారులు తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లకు శిక్షణ అందించారు.

330 మందికి అతి తీవ్ర పోషణ లోపం ఉంది. వారిలో 104 మందికి వైద్య సాయం అందింది.

120 మందికి ఆకలి పరీక్షలు నిర్వహించారు. 10 మందిని ఎన్ఆర్‌సీకి పంపించారు.

1,698 మందికి తీవ్ర పోషణ లోపం ఉండగా 478 మందికి వైద్యం అందించారు.

రక్తహీనత సమస్యకు అడ్డుకట్ట


గత నెల పిల్లలు, తల్లులు, గర్భిణులు, బాలింతలను దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకున్నారు. మహిళల్లో రక్తహీనత సమస్యకు చెక్ పెట్టేలా దృష్టి సారించారు. ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేశారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సంబంధిత అంశంపై జిల్లా సంక్షేమ అధికారి శారద ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ.. పిల్లల పెంపకం సహా పోషకాలతో కూడిన ఆహారం అందించాలని, అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా కేడం లింగమూర్తి



హుస్నాబాద్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా హుస్నాబాద్ పట్టణానికి చెందిన టీపీసీసీ సభ్యుడు, మాజీ సర్పంచి కేడం లింగమూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రంథాలయం నిరుద్యోగులు, విద్యార్థులకే కాకుండా అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుతానని లింగమూర్తి అన్నారు. మంత్రి ప్రభాకర్, నాయకుల సహకారంతో జిల్లాలోని 23 మండలాల్లో ఉన్న గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. లింగమూర్తిని నాయకులు అభినందించారు.

‘అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి’


ఎంపీ బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండలంలోని గుగ్గిళ్లలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరుతూ కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు పలువురు నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో సంజయ్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, సంతోష్‌కుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిలో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు



మాట్లాడుతున్న జడ్జి మిలింద్ కాంబ్లే

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగులు తమ ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వహించాలని జిల్లా అదనపు సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే అన్నారు. పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పుస్తకాలు చదివి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి చందన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణియాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి: భాజపా


ఆటో కార్మికుడితో సభ్యత్వాలు చేయిస్తున్న గంధమల్ల ఆనంద్‌గౌడ్

దుబ్బాక: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం దుబ్బాక పట్టణంలోని పలు వార్డుల్లో, పట్టణ చేనేత సహకార సొసైటీ సంఘంలో కార్మికులకు భాజపా సభ్యత్వాలను అందజేసి మాట్లాడారు. ప్రపంచంలో భారత ఆర్థిక వ్యవస్థను 11 నుంచి 5వ స్థానానికి తీసుకొచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వాల నమోదు జరగాలని సూచించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్, సుంకోజి ప్రవీణ్, గాజుల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ధరతో ‘బంతి’ ఆడుకుంది!

మొన్న కిలో రూ.100.. నిన్న రూ.250

న్యూస్‌టుడే, చేర్యాల: బుధవారం మార్కెట్‌కు వెళ్లిన గృహిణి.. బంతి పూల ధర ఎంతని అడిగారు. కిలో రూ.100 అని చిరువ్యాపారి చెప్పారు. గురువారం బతుకమ్మ పేర్చడానికి అదే మార్కెట్‌కు వెళ్లి బంతి పూలు కొందామని యత్నిస్తే.. కిలో రూ.250 అని చెప్పడంతో గృహిణి విస్తుపోయారు. సద్దుల బతుకమ్మ రోజు చేర్యాలలో బంతి పూల కొరత ఏర్పడింది. గురువారం ఉదయం 9 గంటలకే అయిపోయాయి. డిమాండ్‌ను అసరా చేసుకున్న వ్యాపారులు సిద్దిపేట, జనగామ నుంచి తెప్పించారు. ‘అదను చూసి అమ్ముకుంటేనే.. ఆదాయం’ అని భావించి ధర పెంచేశారు. కిలోకు రూ.250 చొప్పున విక్రయించారు. బతుకమ్మ కోసమే కదా అనుకుంటూ అంతేసి ధరను పెట్టి కొనడం గమనార్హం.

ప్రణాళికాబద్ధం.. ‘ఉపాధి’ సిద్ధం

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: వలసలను నివారించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏటా ఏడాది పాటు నిర్వహించే పనుల గుర్తింపు బడ్జెట్ ప్రణాళిక ప్రక్రియ ప్రారంభమైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేసే పనుల గుర్తింపు కూలీల బడ్జెట్ తయారు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గ్రామసభల ద్వారా ప్రక్రియ చేపట్టారు. గ్రామాల వారిగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. గ్రామసభల్లో ఆమోదం పొందుతున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తించిన పనులకు బడ్జెట్‌ను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. కేంద్రం నుంచి ఆదేశాలు రాగానే పనులు నిర్వహిస్తారు.


గజ్వేల్ మండలంలో గ్రామసభ

జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డులు	1.98 లక్షలు
కూలీల సంఖ్య	3.98 లక్షలు
2024-25లో పనుల లక్ష్యం	49.78 లక్షలు
పూర్తయినవి	42.67 లక్షలు
కూలీలకు చెల్లింపు	86.56 కోట్లు
వంద రోజులు పూర్తి	1028 మంది

క్షేత్రస్థాయిలో పరిశీలన

ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26లో వివిధ కేటగిరీల్లో వివిధ రకాల పనులు చేపడుతారు. ఆయా ప్రాంతాల ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అక్టోబర్ 2 నుంచి నవంబర్ 30 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. అసంపూర్తి పనులు, జాబ్ కార్డుల నవీకరణ, సామాజిక తనిఖీలపై చర్చిస్తున్నారు.

భూగర్భ జలాల పెంపు

గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు, భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం వ్యవసాయ చిన్న నీటి కుంటల ఏర్పాటు చెక్‌డ్యాంలు, కాలువల పూడికతీత పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు నర్సరీల ఏర్పాటు, కంపోస్ట్ షెడ్ల నిర్మాణాలు చేపడతారు. గ్రామసభల్లో పనులను గుర్తించి.. ఆమోదించిన పనుల వివరాలను జిల్లా, రాష్ట్ర స్థాయికి పంపుతామని.. బడ్జెట్ విడుదల చేస్తారని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య


మేషక్

బెజ్జంకి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా తోటపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. తోటపల్లికి చెందిన ఎస్.మేషక్(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందారు. మద్యానికి బానిసైన మేషక్ తరచూ భూపాలపల్లిలో ఉండే సోదరుడికి ఫోన్ చేసి తనకు బతకాలని లేదని చెప్పేవాడు. ఈ నెల 9న గ్రామ శివారులోని చెరువు వద్ద గడ్డి మందు తాగాడు. విషయాన్ని సోదరుడికి ఫోన్‌లో చెప్పాడు. కరీంనగర్‌కు చికిత్సకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సోదరుడు సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి ఆత్మహత్య

చేగుంట, న్యూస్‌టుడే: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా స్టేషన్‌మాసాయిపేట వద్ద గురువారం జరిగింది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. మృతుడికి సుమారు 55 ఏళ్లు ఉంటాయి. అతడి వద్ద ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేవు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదుతో పంచనామా నిర్వహించి కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఆడుకుంటూ వెళ్లి బకెట్‌లో ఉన్న నీటిలో పడి చిన్నారి మృతిచెందిన హృదయవిదారక ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేసీఆర్ నగర్‌కు చెందిన ఒర్సు మహేశ్, మానస దంపతుల 18 నెలల బాలుడు ఒర్సు నితిన్ గత ఆదివారం ఇంట్లో ఆడుకుంటూ ఆవరణలోని స్నానాల గదిలోకి వెళ్లాడు. బకెట్‌లో సగం వరకున్న నీటిలో ఆడుకుంటూ తలకిందులుగా పడిపోయాడు. ఇది గమనించని కుటుంబసభ్యులు ఇంట్లో వెతకగా ఎక్కడ కనిపించకపోవడంతో చివరికి స్నానాల గదిలోకి వెళ్లి చూడగా బకెట్‌లో పడి ఉన్న నితిన్‌ను వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు గురువారం మృతిచెందాడు. బాలుడి తండ్రి మహేశ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరొక్క బతుకమ్మ..


సిద్దిపేటలో ధనలక్ష్మి బతుకమ్మ


మెదక్ పరిధి జంబికుంటలో


సిద్దిపేటలో శివ లింగం రూపంలో..

ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాము లాయె సందమామా.. అంటూ ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క రూపులో అలంకరించిన తీరు అందరినీ ఆకట్టుకోవడం విశేషం.
– న్యూస్‌టుడే బృందం


రేగోడ్‌లో అమ్మవారి ప్రతిమతో..


సిద్దిపేటలో పూలతో ఇలా..


రామాయంపేటలో దుర్గాదేవి, అయోధ్య రామ మందిరంగా కొలువుదీరిన బతుకమ్మ


సిద్దిపేటలో

ఇష్టంతో ఆడి.. ఛాంపియన్లుగా నిలిచి..

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ఫుట్‌బాల్.. ప్రపంచాన్ని ఊపేసే ఆట. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎంతో మంది రాణించారు. మెదక్, జహీరాబాద్ ప్రాంతాల్లో ఈ ఆట ఎక్కువగా ఆడుతుంటారు. ఇలాంటి క్రీడల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారిణులు రాణిస్తూ జాతీయస్థాయిలో తమ సత్తా చాటుతుండటం విశేషం. తాజాగా మెదక్‌లో 68వ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర ఛాంపియన్ జరిగాయి. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు జట్టును విజయబాటలో నడిపించి, ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో ఫుట్‌బాల్‌కు క్రేజ్ ఉండటంతో ఫుట్‌బాల్ అసోసియేషన్ మెదక్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు మెదక్ - 8, సిద్దిపేట- 7, సంగారెడ్డి- ముగ్గురిని ఎంపిక చేశారు. వీరికి పోటీలకు నాలుగు రోజుల ముందు నుంచే మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. రాష్ట్రస్థాయి పోటీలో పలువురు తమ ఆటతో రాణించారు. వారిలో ఉమ్మడి మెదక్ నుంచి 5 మందిని జాతీయస్థాయి పోటీలకు ఆడే రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు.

తండ్రి ఇష్టం మేర..



జట్టుకు సిద్దిపేట జిల్లా కొండపాక మండలం జప్తినాచారానికి చెందిన చైతన్య శ్రీ కెప్టెన్‌గా వ్యవహరించారు. తల్లిదండ్రులు కవిత, రాములు. ప్రస్తుతం సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. రాములుకు ఫుట్‌బాల్ అంటే మక్కువ. దీంతో తన కుమార్తెను అంతర్జాతీయ క్రీడాకారిణిగా చూడాలన్న లక్ష్యంతో చైతన్యశ్రీ నాలుగో తరగతి చదువుతున్న సమయంలోనే హకీంపేట క్రీడా పాఠశాలలో చేర్పించారు. తండ్రి ఇష్టాన్ని గమనించిన ఆమె ఏడో తరగతి పూర్తయ్యాక ఇంటికొచ్చి సొంతంగా సాధన చేస్తూ వచ్చారు. శిక్షకురాలు భాగ్యమ్మ చరవాణి ద్వారా ఇచ్చే సలహాలు పాటిస్తూ వచ్చారు. తాజాగా ఎస్జీఎఫ్ పోటీల్లో మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో కెప్టెన్‌గా కీలకపాత్ర పోషించారు. ఫైనల్‌లో తన ఆట తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈమె ప్రత్యర్థి జట్టు గోల్ చేయకుండా అడ్డుకోవడం అందరినీ ఆకట్టుకుంది.

తొలి ప్రయత్నంలోనే..





ఎస్జీఎఫ్ పోటీల్లో జరిగిన ఫైనల్‌లో ఇరు జట్లు సమాన పాయింట్లు పొందాయి. ఫలితానికి అదనంగా 5 నిమిషాల్లో ఆట ఆడారు. ఫలితం తేలకపోవడంతో అందరూ నిరుత్సాహపడ్డారు. మరోసారి 5 ని. సమయం ఇచ్చి ఆడించారు. 2 ని. ముందు గోల్ చేసి మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో క్రీడాకారిణి శ్రీవాణి కొట్టిన గోలే కారణం. ఈమె స్వగ్రామం మెదక్ మండలం సంగాయిగూడ తండా. తండ్రి తార్య మెదక్‌లో హోంగార్డు, తల్లి మహిళా రైతు. శ్రీవాణి మెదక్ తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. భాగ్య మ్మ వద్ద శిక్షణ పొందుతున్నారు. తొలిప్రయత్నంలోనే జాతీయస్థాయిలో ఆడే జట్టుకు ఎంపికయ్యారు.

'ఈనాడు' లక్ష్య ఆధ్వర్యంలో..

ఉమ్మడి మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో క్రీడాకారిణులకు శిక్షణ ఇచ్చారు. వారికి ఆయనే సొంతంగా భోజనం ఏర్పాటుచేయించారు. స్థానిక టీజీఆర్ఎస్‌లో వసతి కల్పించారు. వారికి 'ఈనాడు' ఆధ్వర్యంలో 'లక్ష్య' కార్యక్రమంలో భాగంగా నియమించిన శిక్షకురాలు భాగ్యమ్మ ప్రత్యేకంగా తర్ఫీదు ఇచ్చారు. ప్రధానంగా క్రీడాకారిణుల్లో సమష్టిభావాన్ని పెంపొందించారు.

తొలిసారి ఆడిపాడి



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పెద్దతండాలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచి గుగులోతు లక్ష్మి సక్రునాయక్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఆడిపాడటం విశేషం. గతంలో ఈ గ్రామంలో బతుకమ్మ ఆడే సంప్రదాయం లేకపోవడం గమనార్హం.
– న్యూస్‌టుడే, అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం)

అమెరికాలో వైభవం చాటి..



అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసం ఉంటున్న సిద్దిపేట వాసుల బతుకమ్మ సంబరాలు
– న్యూస్‌టుడే, సిద్దిపేట

సనాతన ధర్మాన్ని కాపాడాలి: సుమన్


కాళికామాతకు అభిషేకం చేస్తున్న సినీ నటుడు సుమన్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడాలని, కుల మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవించాలని సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. వెల్దుర్తి మండలం మన్నెవారిజలాల్‌పూర్ శివారులో కాళికామాత ఆలయంలో గురువారం నిర్వహించిన దివ్య విశ్వశాంతి మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని వారి విజ్ఞతకు వదిలేస్తున్నానని, తిరుపతి లడ్డూ వ్యవహారంపై విచారణ జరుగుతోందని, ఇవన్నీ చూస్తుంటే బాధ కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అన్ని కులాలు, మతాలకు చెందిన స్నేహితులున్నారని పేర్కొన్నారు. మన్నెవారిజలాల్‌పూర్ కాళికామాత అమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశం బాగుండాలని, సినిమా పరిశ్రమ బాగుండాలని, చిన్న నిర్మాతలు ఆర్థికంగా ఎదగాలని అమ్మవారిని కోరుకున్నట్లు సుమన్ తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్, భారాస, భాజపా పార్టీలకు చెందిన నాయకులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం


సుధాకర్

శివ్వంపేట: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. శివ్వంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని గొట్టిముక్లకు చెందిన జరుపటి సుధాకర్(19) బుధవారం రాత్రి కాలినడకన వెళ్తున్నాడు. అదే సమయంలో చెన్నాపూర్‌కు చెందిన ద్విచక్ర వాహనదారుడు చిన్నగొట్టిముక్ల కొత్త కాలనీ వద్ద సుధాకర్‌ను ఢీకొట్టడంతో మృతి చెందాడు. తండ్రి నాగేష్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. కుమార్తె వివాహం వచ్చే నెలలో ఉందని, ఈ తరుణంలో కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదైంది.

గునుగు పూలకు వెళ్లి..


వెంకటేష్

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం): బతుకమ్మ పేర్చేందుకు గునుగుపూలు తెచ్చేందుకు వెళ్లిన మాజీ ఉపసర్పంచి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారం రాజీవ్ రహదారిపై జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. లకుడారానికి చెందిన మాజీ ఉపసర్పంచి బింగి వెంకటేశ్ (39) గురువారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లాడు. తిరిగొస్తుండగా మలుపు వద్ద వెంకటేశ్ వాహనాన్ని హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టడంతో కింద పడి మృతి చెందాడు. కారును గోదావరిఖనికి చెందిన బొల్లి రాజు నడిపిస్తున్నారు. వెంకటేశ్ సోదరుడు మల్లేశం ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పరోపకారుడు.. విధికి తలవంచాడు


అనంత్‌రెడ్డి

హైదరాబాద్, వికారాబాద్: పెద్ద చదువులు చదవకపోయినా ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ నలుగురికి సాయం చేసే మనస్తత్వం అతని సొంతం.. ఆపత్కాలంలో ఉన్న పలువురికి 26 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. ప్రేమించిన యువతిని తల్లిదండ్రులను ఒప్పించి ఏడాదిన్నర కిందట కులాంతర వివాహం చేసుకున్నాడు. పరోపకారిగా పేరు తెచ్చుకున్న ఆ యువకుణ్ని రోడ్డు ప్రమాదం కబళించింది. సాయం చేసే చేతులు ఇక లేవన్న నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇద్దరు ఆడ పిల్లల తరువాత అనంతపద్మనాభస్వామికి మొక్కుకుంటే జన్మించగా, ఎంతో అపురూపంగా ఆ దేవుడి పేరే పెట్టారు. అయినా ఇలా అయిందేమిటని, అతన్ని మంచితనాన్ని చూసైనా మృత్యువు కరుణించలేదని ఆ తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కేపీహెచ్‌బీ ఎస్సై నజీర్‌మియా తెలిపిన వివరాలు.. వికారాబాద్ మండలం గోదమగూడకు చెందిన ఏనుగు అనంత్‌రెడ్డి(24) ఫొటోగ్రాఫర్. సామాజిక కార్యకర్త. తలసేమియా వ్యాధిగ్రస్తులు, ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తదానం చేశాడు. ఆగస్టు 11న అర్ధరాత్రి బైక్‌పై ఒంటరిగా ఉప్పల్ నుంచి కేపీహెచ్‌బీ వైపు వచ్చాడు. జేఎన్‌టీయూ సిగ్నల్ దాటాక బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలవగా, కాచిగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి కోమాలోనే ఉన్న అనంత్‌రెడ్డి ప్రాణాలు కోల్పోయాడు.

విద్యుదాఘాతంతో బీటెక్ విద్యార్థి మృతి


అనిల్‌కుమార్

చేగుంట, న్యూస్‌టుడే: చదువుకుంటూనే.. తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్న ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మెదక్ జిల్లా చేగుంట ఎస్‌ఐ చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన గడ్డమీది మంజుల, కిషన్ దంపతులు చేగుంటలోని గజ్వేల్ మార్గంలో ఉంటూ పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు అనిల్‌కుమార్(21), వినయ్ ఉన్నారు. అనిల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధి హోలీ మేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం, చిన్న కుమారుడు ఇంటర్ చదువుతున్నారు. సెలవులకు అనిల్ ఇంటికొచ్చాడు. గురువారం మిత్రుడు సమీర్‌తో కలిసి పాత ఇనుప సామగ్రిని చిన్న లారీలో ఎక్కిస్తున్నాడు. ఇనుప నిచ్చెన పైకి ఎత్తుతుండగా 11 కేవీ విద్యుత్తు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అనిల్ మృతిచెందాడు. కళ్లముందు విగతజీవిగా పడిఉన్న కుమారుణ్ని చూసి తల్లిదండ్రులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. గాయపడిన సమీర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి ఒడి చేరిన పసికందు

పోలీసుల అదుపులో ఇద్దరు మహిళలు


శిశువుతో తల్లి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మాతృత్వం.. మహిళలకే ప్రత్యేకమైన ఓ వరం. ఓ మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చి దాన్ని పంచితే.. భూమ్మీద పడగానే అభంశుభం తెలియని ఆ బిడ్డను తల్లి పొత్తిళ్లకు దూరం చేసి అమ్మదనానికి మాయని మచ్చ తెచ్చారు మరో నలుగురు మహిళలు. అధునాతన సాంకేతికతకు పోలీసుల చొరవ తోడు కావడంతో 24 గంటల్లోనే ఆ శిశువు తల్లి ఒడి చేరింది. వివరాలు ఇలా..

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అపహరణకు గురయిన పసికందు ఆచూకీ లభించింది. నలుగురు మహిళలు బుధవారం శిశువును అపహరించినట్లు సీసీ కెమెరాల్లో నమోదయిన విషయం విదితమే. సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును 24 గంటల్లోనే ఛేదించారు. గురువారం హైదరాబాద్‌లోని బోరబండ పరిధి అల్లాపూర్‌లో నిందితులైన ఇద్దరు మహిళలను సంగారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను శుక్రవారం వెల్లడిస్తామని సీఐ స్పష్టం చేశారు.

10 బృందాలతో గాలింపు

మనూరు మండలం దూదిగొండకు చెందిన నసీమా ఈ నెల 9న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ ద్వారా ఆడ శిశువుకు జన్మనిచ్చారు. నసీమా తల్లీ మునీబీ, అత్త హమీదాలు ఆసుపత్రి ఆవరణలోని కారిడార్‌లో ఆ శిశువును పడుకోబెట్టగా నలుగురు మహిళలు వచ్చి గుట్టుగా అపహరించారు. అక్కడి నుంచి స్కూటీపై ఉడాయించారు. సీసీ కెమెరాల్లో నమోదయిన దృశ్యాల ఆధారంగా వెంటనే చెక్ పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు పెంచారు. ఎస్పీ రూపేష్ ఆదేశాలతో పది ప్రత్యేక బృందాలను నియమించారు. విశ్వసనీయంగా అందిన సమాచారం ఆధారంగా హైదరాబాద్ బోరబండలోని అల్లాపూర్‌లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శిశువును తల్లి ఒడికి చేర్చారు. దీంతో తల్లితో పాటు కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు. శిశువులను అపహరించేందుకు నిందితులు పలుమార్లు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పసికందు అపహరణ నేపథ్యంలో గురువారం అదనపు ఎస్పీ సంజీవరావు తనిఖీలు చేపట్టారు. మరోమారు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం ఆసుపత్రి పర్యవేక్షకులకు వినతి పత్రం అందజేశారు.

అన్నదాతకు తీపి కబురు

పంట నష్ట పరిహారం మంజూరు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

ఆరుగాలం శ్రమించే రైతులకు ప్రభుత్వం తీపి కబురును వినిపించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో గత నెలలో భారీ వర్షాలు కురిసిన విషయం విదితమే. దీంతో చేతికొచ్చిన పంటలు నీళ్లపాలయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, కోహెడ ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ఇసుక మేటేసి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది.

ప్రధాన పంటలు..

నాలుగు జిల్లాల్లో ప్రధానంగా వరి, పత్తి, కందులు, సోయాబీన్, పెసర, మినుము, చెరకు పంటలకు తీవ్ర నష్టం చేకూరింది. ఇక కూరగాయలు సాగు చేసిన వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఎంతో మంది తాము పెట్టిన పెట్టుబడైనా చేతికొచ్చేనా అని కలవరానికి గురయ్యారు. నష్టం తీరుపై సర్వే చేపట్టి, ఏ మేర దెబ్బతిన్నాయో అంచనా వేసి నివేదిక పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టాన్ని లెక్క తేల్చారు.

33 శాతం మేర..

ప్రభుత్వ ఆదేశాలతో 33 శాతం లెక్కన నష్టాన్ని గుర్తించారు. గ్రామాలు, మండలాల వారీగా క్రోడీకరించిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం మంజూరు చేయడంతో పాటు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. దసర పండగ సమయంలో పరిహారంపై ప్రభుత్వ ప్రకటనతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నష్టపోయిన పంట

నాలుగు జిల్లాల్లో నష్టపోయిన ఎకరాలు, రైతులు, పరిహారం మంజూరు వివరాలు..

జిల్లా	నష్టం	రైతులు	పరహారం (రూ.లలో)
సంగారెడ్డి	3288.34	2881	3,28,88,500
సిద్దిపేట	727.34	877	72,76,000
మెదక్	157.12	147	11,30,500
వికారాబాద్	1512.32	1378	1,51,28,000

ఆరోగ్యానికి గుడ్డు

నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం



న్యూస్‌టుడే, సిద్దిపేట

కోడిగుడ్డు.. ఎన్నో పోషకాల సమాహారం. ఎంతో మంది నిత్యం తీసుకునే ఆహారంలో ఓ భాగం. ఉడకబెట్టిన గుడ్డులో పోషకాలు పుష్కలమని వైద్య నిపుణులు చెబుతున్నారు. చౌకగా.. సులువుగా లభించే ఆహారం కావడం మరో విశేషం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో గుడ్డు ప్రియులు భారీగానే ఉన్నారు. ఈ రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా కలిగే ప్రయోజనాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉడికించిన కోడిగుడ్డు తింటే లభించే పోషకాలు

- విటమిన్ ఎ - 6 శాతం
- విటమిన్ బి2- 15 శాతం
- విటమిన్ బి5 - 7 శాతం
- విటమిన్ బి12 - 9 శాతం
- సెలీనియం - 22 శాతం
- ఫోలేట్ - 5 శాతం
- ఫాస్ఫరస్ - 9 శాతం

మీకు తెలుసా..


60 గ్రాముల కోడి గుడ్డు నుంచి శక్తి - 103 కేలరీలు, ఇనుము - 1.26 మి.గ్రా, ఫాస్పరస్ - 132 మి.గ్రా, క్యాల్షియం - 36 గ్రాములు, కొవ్వులు - 7.9 గ్రాములు, ప్రొటీన్ - 7.9 గ్రాములు లభిస్తాయి. వాటితో పాటు క్యాల్షియం, జింక్, తదితర ఖనిజాలు, బీ6, డీ, ఈ, కే విటమిన్లు దండిగా ఉంటాయి. ఒక గుడ్డులో 1.5 గ్రాముల పచ్చసొన, 213 మి.గ్రా కొలెస్ట్రాల్, 75 క్యాలరీలు ఉంటాయి.

జిల్లా	గుడ్ల వినియోగం (సుమారు)
సిద్దిపేట	7 లక్షలు
సంగారెడ్డి	7.5 లక్షలు
మెదక్	2.5 లక్షలు
వికారాబాద్	1.5 లక్షలు

ప్రయోజనాలు అనేకం..

● పిల్లలకు ఆహారంలో కోడిగుడ్డును తప్పనిసరి చేయాలి. కంటి సంబంధిత సమస్యలు దరిచేరవు. ● నిత్యం గుడ్డు తీసుకుంటే శరీరానికి అవసరమైన కొలెస్ట్రాల్ లభిస్తుంది. ● రక్తపోటు అదుపులో ఉంటుంది. ● అల్పాహారంలో గుడ్డు తీసుకుంటే బరువు తగ్గుతారు. ఎత్తు పెరిగేందుకు దోహదపడుతుంది.

కావాల్సిన పౌష్టికాహారం..: డా. చందర్, అసోసియేట్ ప్రొఫెసర్, సిద్దిపేట సర్వజన ఆసుపత్రి



కోడిగుడ్డులో పోషకాహారం మెండు. గర్భిణులు, చిన్నారులు ఇష్టంగా తినడం అలవర్చుకోవాలి. ఆరోగ్యంగా ఉండేందుకు కావాల్సిన ప్రొటీన్లు ఉపకరిస్తాయి. శరీరం, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

రతన్‌టాటాకు చిత్ర నివాళి





దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటాసన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు సిద్దిపేటకు చెందిన చిత్రకారుడు కిన్నెర అంజయ్య చిత్ర నివాళి అర్పించారు. ఆయన మృతి సమాజానికి తీరని లోటని.. సామాన్యుల కలలను సాకారం చేసిన ఘనత టాటా సొంతమని పేర్కొన్నారు. మెదక్‌కు చెందిన ఓ విద్యార్థి పెన్సిల్ స్కెచ్‌తో చిత్రాన్ని ఆవిష్కరించారు.
- న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్‌అర్బన్

మూతపడిన పరిశ్రమలో భారీ చోరీ యత్నం

మనోహరాబాద్: మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని టీజీఐఐసీ పరిధిలోని మూతపడిన పరిశ్రమలో దుండగులు భారీ చోరీకి యత్నించారు. విషయం తెలిసి పోలీసులు దుండగులను వెంబడించడంతో పారిపోయారు. మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంక్ రుణాలు చెల్లించకపోవడంతో కొన్ని సంవత్సరాల క్రితం బీఎస్ స్టీల్ పరిశ్రమను సీజ్ చేశారు. దీని గురించి ఎవరూ పట్టించుకోకపోవంతో కొన్ని రోజులుగా పరిశ్రమలోని ఇనుప సామగ్రిని మండలంలోని కోనాయిపల్లి, రంగాయపల్లి, ముప్పిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన నిందితులు చోరీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి కొంతమందిని జైలుకు పంపారు. ఇదిలా ఉంటే బుధవారం అర్ధరాత్రి కొంతమంది పరిశ్రమ లోపలికి క్రేన్, టిప్పర్ తీసుకెళ్లి రూ.లక్షల విలువ చేసే భారీ యంత్రాన్ని చోరీ చేసేందుకు పన్నాగం పన్నారు. విశ్వసనీయ వర్గాల ద్వారా పోలీసులకు చోరీ సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి వచ్చే సరికి అక్కడ క్రేన్ మాత్రమే ఉంది. వెంటనే అప్రమత్తమై వెంబండించగా మేడ్చల్ సమీపంలో టిప్పర్ దొరికింది. అందులో భారీ యంత్రం కనిపించడంతో పోలీసులను చూసి దుండగులు వాహనాన్ని వదిలేసి పారిపోయారు. ఎస్బీఐ అధికారి రవీందర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. క్రేన్, టిప్పర్‌ను సీజ్ చేసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. చోరీకి పాల్పడిన వారితో పాటు స్క్రాప్ దుకాణ యజమానిని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితులను త్వరలో అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.


సిద్దిపేట: బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు


సిద్దిపేటలో..


కొండపాక గ్రామీణం: దుద్దెడలో సంబురాలు


దుబ్బాక: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


దౌల్తాబాద్: మహ్మద్ షాపూర్‌లో..


చిన్నకోడూరు: చంద్లాపూర్‌లో జడ్పీ మాజీ అధ్యక్షురాలు రోజాశర్మ తదితరులు


కొండపాక గ్రామీణం: కుకునూరుపల్లిలో 11 అడుగుల భారీ బతుకమ్మ

మది నిండుగా.. పూల పండుగ

న్యూస్‌టుడే జిల్లా బృందం: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే సద్దుల బతుకమ్మ వేడుకలను జిల్లా వ్యాప్తంగా గురువారం మహిళలు సంబురంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. మహిళలు, యువతులు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి సాయంత్రం ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పెట్టి లయబద్ధంగా ఆడుతూ పాటలు పాడారు. స్థానిక నీటివనరుల్లో నిమజ్జనం అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుంటూ వెంట తెచ్చుకున్న ప్రసాదాలు పంచుకున్నారు. బతుకమ్మ ఆడుతుండగా వర్షం రావడంతో పలు చోట్ల మహిళలు ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రాంతాల్లో నిర్వాహకులు నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు, చిన్నారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, యువత, తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల: కిష్టంపేటలో..


దుబ్బాక: పురాధ్యక్షురాలు గన్నె వనిత, కత్తి కార్తీక గౌడ్ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585053
జగదేవపూర్ 8008573209
హుస్నాబాద్ 8008573520
దుబ్బాక 9030037175
చేర్యాల 8008574871
గజ్వేల్ 9490675047
(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, దుబ్బాక, చేర్యాల:

? దుబ్బాకలోని 18వ వార్డులో ఏర్పాటు చేసిన ఉద్యానం ప్రారంభించకపోవడంతో విద్యార్థులు ఉద్యానం ప్రహరీ దూకి ఆడుకోవాల్సి వస్తుంది. వెంటనే అందుబాటులోకి తేవాలి. - వరుణ్, దుబ్బాక

✔ త్వరలోనే ప్రారంభించి, పిల్లలకు అందుబాటులోకి తీసుకొస్తాం.
– రమేశ్ కుమార్, పుర కమిషనర్

? దుబ్బాక మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల వెంబడి పాడుబడిన బావులు ఉన్నాయి. వాటి చుట్టూ రక్షణ చర్యలు ఏర్పాటు చేసి, సమస్య పరిష్కరించండి? – వెంకటేశ్, ధర్మాజీపేట

✔ త్వరలోనే రెవెన్యూ అధికారులతో కలిసి ప్రమాదకర బావుల చుట్టూ రక్షణ చర్యలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– పి.శ్రీనివాస్, దుబ్బాక సీఐ.

? చేర్యాల మండలం కడవేర్గులోని 2, 3 వార్డుల్లో విద్యుత్తు దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. అరికట్టాల్సిన పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలి.
– నాగయ్య, కడవేర్గు

✔ గ్రామంలో విద్యుత్తు దీపాలకు సంబంధించి ప్రత్యేకంగా మూడో తీగ బిగించకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడుతోంది. సంబంధిత శాఖ ఏఈకి చెప్పాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.
– మహబూబ్ అలీ, కడవేర్గు ప్రత్యేకాధికారి.

పూలను పూజించే గొప్ప సంస్కృతి మనది: ఎమ్మెల్యే


భవాని రుద్రేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

చేర్యాల, న్యూస్‌టుడే: ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ప్రకృతి నుంచి లభించే పూలను పూజించే సంస్కృతి మనదని, ప్రకృతిపై మనకున్న ప్రేమ, అనురాగం, అనుబంధానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంతో పాటు ఆకునూరు భవానీ రుద్రేశ్వరాలయం, మద్దూరు మండలం మర్మాములలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవ మండపాల్లో ఆయన గురువారం ప్రత్యేక పూజలు చేశారు. చేర్యాల కుడి చెరువులో బతుకమ్మ నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దయతో అందరూ ఆరోగ్యంగా ఉండాలని, బతుకమ్మ, దసరా పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట చేర్యాల బల్దియా అధ్యక్షుడు స్వరూపారాణి, ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆప్యాయతకు ప్రతీక బతుకమ్మ: కొత్తప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుక నిలుస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మిరుదొడ్డి, అక్బర్‌పేట- భూంపల్లి మండలాల పరిధిలో పలు గ్రామాల్లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మను అంగరంగ వైభవంగా జరిగేవన్నారు. ఆడపడుచుల ఆప్యాయతకు బతుకమ్మ పండుగ ప్రతిరూపంగా నిలుస్తుందన్నారు. ఆయన వెంట శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడ మండలం బస్వాపూర్ వాగులో ఇసుక నింపుకొని వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా.. గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ వదిలేసి పారిపోయాడు. ట్రాక్టర్ నంబరు ఆధారంగా వివరాలు సేకరించగా.. అదే గ్రామానికి చెందిన చామంతుల పోచయ్యకు చెందినదిగా విచారణలో తేలింది.

తిరిగొచ్చిన అగ్నిమాపక వాహనం

దుబ్బాక: ఆరు నెలల కిందట దుబ్బాక అగ్నిమాపక కేంద్రంలో ఉన్న అత్యాధునిక అగ్నిమాపక వాహనాన్ని సిద్దిపేటకు తరలించి, అక్కడున్న పాత వాహనాన్ని దుబ్బాకకు కేటాయించారు. దీంతో దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలువురు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులను కలిసి గతంలో దుబ్బాకకు మంజూరు చేసిన వాహనాన్ని తిరిగి పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి చొరవతో గురువారం వాహనాన్ని దుబ్బాకకు పంపించారు. ఇందుకు సహకరించిన అగ్నిమాపక శాఖ అధికారులకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

యువకుల నిజాయతీ.. చరవాణి, పర్సుల అప్పగింత

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబురాల్లో భాగంగా కోమటి చెరువు ప్రాంతంలో ఓ మహిళ తన పర్సును పోగొట్టుకుంది. అదే ప్రాంతంలో ఉన్న వ్యక్తి ఆ పర్సును అక్కడే విధులు నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ ఉపేందర్, ఎస్సై వెంకట్‌రెడ్డికి అప్పగించారు. అందులో రూ.40 వేల విలువైన చరవాణి ఉంది. అదే సమయంలో ఫోన్ రావడంతో విషయం వారికి తెలిపారు. వెంటనే అక్కడికి రాగా పోలీసులు వారికి అప్పగించారు. మరో మహిళ రూ.600 ఉన్న తన పర్సును పోగొట్టుకోగా సాయి అనే వ్యక్తి ఆ పర్సును పోలీసులకు అప్పగించాడు.

ఎంపీవో బాధ్యతల స్వీకరణ

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండల పంచాయతీ అధికారిగా గుగులోతు మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

దీపా దాస్‌మున్షీని కలిసిన ఆంక్షారెడ్డి



గజ్వేల్, న్యూస్‌టుడే: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి గురువారం దిల్లీలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీని కలిశారు. జిల్లా రాజకీయాలు, రాష్ట్ర యువజన రాజకీయాలపై చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను యువత ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని ఆంక్షారెడ్డికి సూచించారు.

అభివృద్ధి పనులే చిరస్థాయిగా నిలుస్తాయి


బాలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి తదితరులు

ములుగు, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధికి చేసిన పనులే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి అన్నారు. గురువారం ములుగులో జరిగిన మాజీ సర్పంచి బాలమ్మ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ములుగు అభివృద్ధిలో బాలమ్మ చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరు ఆమెను ఆదర్శంగా తీసుకొని అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సలీం, భారాస రాష్ట్ర కార్యదర్శి జుబేర్ పాషా, డీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్గల్, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి పేదలకు ఆసరాగా నిలుస్తుందని నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్‌లో బాధిత కుటుంబ సభ్యులకు రూ.76వేల విలువైన చెక్కులను అందజేశారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తరించాలి

గజ్వేల్, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో రోటరీ క్లబ్ సేవలు అందించాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ నరసింహ యాదవ్ అన్నారు. గురువారం గజ్వేల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ కేంద్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో పేదల అవసరాలను తీర్చడానికి రోటరీ క్లబ్ ముందుండాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని చిరు వ్యాపారులకు తోపుడుబండ్లను అందిస్తామన్నారు. అలాగే కాలినడకన వెళ్లే పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు ఇస్తామని తెలిపారు. గజ్వేల్ సెంట్రల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు తుమ్మ కృష్ణ, క్లబ్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

దారిలో మక్కలు.. వాహనదారుల తిప్పలు



వానాకాలం వచ్చిందంటే చాలు పంట ఉత్పత్తులను ఆరబోసేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పొలాల వద్ద సరైన కళ్లాలు లేక రహదారుల వెంట ఎండబెడుతున్నారు. ప్రస్తుతం చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న కోతలు జోరందుకున్నాయి. చిన్న, సన్నకారు రైతులకు సరిపడా కల్లాలు లేకపోవడంతో కంకులు, జొన్నలను రోడ్లపైనే ఆరబోస్తున్నారు. ప్రతి సీజన్‌లో దారిలో సగం వరకు పంట ఉత్పత్తులను ఆరబెట్టుకోవడం అన్నదాతలకు పరిపాటిగా మారింది. దీంతోపాటు ధాన్యం కుప్పలపైకి వాహనాలు రాకుండా పెద్ద పెద్ద బండరాళ్లు, కట్టెలు అడు పెడుతున్నారు. కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచుతున్నారు. రాత్రిపూట వాహనదారులకు రాళ్లు, కట్టెలు, పరదాలు కనిపించక పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించి, తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, చిన్నకోడూరు:

పోషకాహారంతోనే ఆరోగ్య సమాజం

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ఆరోగ్య సమాజ నిర్మాణానికి బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అత్యంత అవసరమని కార్తీక ఫౌండేషన్ అధ్యక్షురాలు, భారాస రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక పేర్కొన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గర్భిణులు శిరీష, రేణుకలకు మా ఇంటి మహాలక్ష్మిలో భాగంగా న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సాధారణ ప్రసవంతో పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భారాస మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి నష్టం కల్గించే వారిపై చర్యలు తప్పవు: భారాస

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పట్టణంలో కొందరు కౌన్సిలర్లు పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని, వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని భారాస పట్టణాధ్యక్షుడు అన్వర్‌పాషా, నియోజకవర్గ భారాస అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. గురువారం భారాస కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీకి చెడ్డపేరు తీసుకొచ్చేలా ప్రవర్తిస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యుడు వొడితల సతీశ్ కుమార్ ఆదేశాల మేరకు పార్టీని దిక్కరించిన నాయకులు ఎంతటివారైనా క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని సూచించారు. భారాస నాయకులు యాస శ్రీనివాస్, కందుకూరి శ్రీనివాస్, మాటూరి ప్రేమ్‌కుమార్, భూక్య రాజునాయక్, కనకరాజు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటా సేవలు చిరస్మరణీయం


రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతిచెందడంతో ఆయన చిత్రపటానికి కొండపాక మండల కేంద్రంలో గురువారం పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రతన్ టాటా భారతదేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య, నాయకులు బాలచందర్, ప్రశాంత్, నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

జగదేవపూర్, న్యూస్‌టుడే: మండల పరిధి ఇటిక్యాల కేంద్రంగా పని చేస్తున్న ఆర్బీపీ ట్రస్ట్ సభ్యులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటిక్యాల గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ పురస్కరించుకొని గురువారం కొత్త దుస్తులు అందజేశారు. పేదల కోసం వైద్య శిబిరాలు, వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రావి కంటి చంద్రశేఖర్ గుప్త తెలిపారు.

నిత్యావసర సరకుల అందజేత

సిద్దిపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని 20వ వార్డు పరిధిలో సేవలు అందిస్తున్న మున్సిపల్ జవాన్, పారిశుద్ధ్య కార్మికులు, నీరు, విద్యుత్తు లైన్‌మెన్లకు కౌన్సిలర్ రియాజుద్దీన్ గురువారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంకితభావంతో అందించే సేవలు పట్టణ ప్రగతికి దోహదం చేస్తాయని తెలిపారు.

బాధిత కుటుంబాలకు చేయూత

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలం పంతులుతండాకు చెందిన బాధిత కుటుంబాలకు ఆ తండాలోని ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు అండగా నిలిచారు. అక్కన్నపేటలోని పెట్రోలు బంక్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన కరంటోతు కవిత, కరంటోతు స్వరూప కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. వారికి రూ.60వేల నగదు అందించారు. అదే తండాలో విద్యుదాఘాతంతో మృతిచెందిన భూక్యా సేవాలాల్ కుటుంబానికి రూ.15వేలు అందించారు.

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు


కొండపాక గ్రామీణం: మర్పడ్గ విజయదుర్గా


కంచరిబజార్‌లో గంటలతో అలంకారం

సిద్దిపేట టౌన్, కొండపాక గ్రామీణం, మిరుదొడ్డి, న్యూస్‌టుడే: జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గాదేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో అందంగా అలంకరించారు. పలు ఆలయాల్లో మహిళలు కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. పాటలు పాడుతూ కోలాటం ఆడారు.


సిద్దిపేట: అమ్మవారు


మిరుదొడ్డిలో దుర్గాదేవి

బస్టాండ్ భళా.. బస్సులు లేక వెలవెల

రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్నా పట్టించుకోని వైనం

న్యూస్‌టుడే, కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం): ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పలు చోట్ల ప్రయాణ ప్రాంగణాలు నిర్మించింది. అందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా కొన్ని ప్రాంగణాలు బస్సులు రాక నిరుపయోగంగా మారి ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో 20 ఏళ్ల కిందట స్థానికుడైన కాసం రాజమౌళి రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న ఎకరా స్థలాన్ని బస్టాండ్ నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు. అదే స్థలంలో ప్రభుత్వం రెండంతస్తుల్లో విశాలంగా ప్రయాణ ప్రాంగణం నిర్మించడంతో కొన్నాళ్లపాటు రాకపోకలు సాఫీగానే సాగాయి. ఆ తర్వాత బస్సులు రాకపోవడంతో బస్టాండు వృథాగా మారింది.


కుకునూరుపల్లిలో వృథాగా బస్టాండు

ఎక్కడ చూసినా వ్యర్థాలే..

బస్టాండు లోపలికి బస్సులు రాకపోవడంతో ప్రజలు రాజీవ్ రహదారికి ఇరువైపులా నిలబడి అక్కడ నిలిపే బస్సుల్లో తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. బస్టాండు వృథాగా ఉండడంతో కొందరు తమ సొంత వాహనాలను అందులో నిలుపుతున్నారు. వ్యర్థాలను పారబోస్తున్నారు. రాత్రి పూట అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు అవకాశం

సుమారు 15 గ్రామాల ప్రజలు కుకునూరుపల్లి నుంచి సిద్దిపేట, చేర్యాల, గజ్వేల్, హైదరాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. రహదారిపై బస్సుల కోసం వేచిచూసే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు చొరవ తీసుకొని ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకొస్తాం

– బాబునాయక్, అసిస్టెంట్ డిపో మేనేజర్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్

కుకునూరుపల్లిలో ప్రయాణ ప్రాంగణాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రస్తుతం బస్టాండు ముందు బస్సులు ఆగుతున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.


రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

హామీల అమలులో విఫలం: సీపీఎం

చేర్యాల, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు ఇప్పటివరకు ఇవ్వలేదని, అనేక షరతులతో రుణమాఫీ కొందరికే చేశారన్నారు. బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు చీరలు ఇస్తామని ఒకసారి, ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని మరోసారి ప్రకటనలతోనే సరిపుచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలన్నింటినీ సంపూర్ణంగా అమలు చేయాలని, లేదంటే ప్రజలను ఏకం చేసి సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు భాస్కర్, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.